ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
గురువారం 1 ఫిబ్రవరి 2024 | 5





గవర్నర్ అబ్దుల్‌నజీర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ కృతికాశుక్లా

ప్రజల అభివృద్ధితోనే.. దేశాభివృద్ధి

- రాష్ట్ర గవర్నర్, జేఎన్‌టీయూకే కులపతి ఎస్.అబ్దుల్ నజీర్
- ఘనంగా కాకినాడ జేఎన్టీయూకే పదో స్నాతకోత్సవం
- ముఖ్యఅతిథిగా మాజీ నేవీ రియర్ అడ్మిరల్ వెంకటశేషాచారి
- టీసీఎస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు గౌరవ డాక్టరేట్ ప్రదానం
- 64 పీహెచ్‌డీ అవార్డులు, 28 బంగారు పతకాలు ప్రదానం



జేఎన్‌టీయూకే స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్



వి.రాజన్నకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్న గవర్నర్ అబ్దుల్‌నజీర్



మాట్లాడుతున్న ఎస్.వెంకటశేషాచారి



మాట్లాడుతున్న ఉపకులపతి ప్రసాదరాజు





గవర్నర్ నుంచి పీహెచ్‌డీ అందుకుంటున్న ఎం.జయ, బంగారు పతకం అందుకుంటున్న ఎస్ఎస్పీ శ్రీసాగరి

జేఎన్టీయూకే, జనవరి 31: ప్రజల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర గవర్నర్, జేఎన్‌టీయూకే కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. వర్సిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో కాకినాడ జేఎన్టీయూకే పదో స్నాతకోత్సవాన్ని బుధవారం ఉదయం 11గంటలకు గవర్నర్ అధ్యక్షతన ప్రారంభించారు. ఈ వేడుకలకు మాజీ నేవీ రియర్ అడ్మిరల్ ఎస్.వెంకటశేషాచారి ముఖ్యఅతిథిగా విచ్చేయగా టీసీఎస్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. జేఎన్టీయూకే ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు, ఏపీఎస్సీహెచ్ఈ చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, డైరెక్టర్లు, ఈసీ సభ్యులు, ప్రిన్సిపాల్స్ వేదికను అలంకరించారు. ఈ కార్యక్రమానికి అతిథులు, పీహెచ్‌డీ అవార్డు గ్రహీతలు, బంగారు పతక విజేతలు స్నాతకోత్సవ సంప్రదాయ వస్త్రధారణలో విచ్చేశారు.

గవర్నర్ అబ్దుల్‌నజీర్ మాట్లాడుతూ పీహెచ్‌డీ అవార్డు గ్రహీతలు, బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. జేఎన్టీయూకే న్యాక్‌ఏ+ గ్రేడ్, యూసీఈకే ఎన్‌బీఏ గుర్తింపు సాధించినందుకు వర్సిటీ అధికారులను ప్రశంశించారు. స్వామి వివేకానంద మాటలను గుర్తుచేశారు. ఒక ఆలోచనను స్వీకరించి దాన్ని తమ జీవితంగా చేసుకోవాలని దాని గూర్చే ఎల్లప్పుడూ ఆలోచిస్తూ కలలు కంటూ లక్ష్యాన్ని సాధించాలన్నారు. తమను తాము విశ్వసించాలని, తమ జ్ఞానం సామర్థ్యాలపై అత్యంత విశ్వాసం చూపాలని సూచించారు. ఉన్నతవిద్య విద్యార్థులకు నైతిక, రాజ్యాంగ విలువలు, కళలు, ఉత్సుకత, సాంకేతికత అధ్యయనం చేసేలా రూపొందించాలని కోరారు. వృత్తిపరంగా ప్రతిఒక్కరూ సమాజంకోసం కృషిచేయాలన్నారు. ఒక వ్యక్తి వ్యక్తిత్వాన్ని రూపుదిద్దడంలో విద్యాసంస్థల బాధ్యత ఎంతో ఉందన్నారు. అనంతరం ముఖ్యఅతిథి వెంకటశేషాచారి మాట్లాడుతూ విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించే పరిశ్రమలకోసం పరిశోధనాభివృద్ధి ప్రాజెక్టులను ప్రోత్సహించాలని కోరారు. దక్షిణ చైనా సముద్రంలోని పరిస్థితులు, రష్యా-ఉక్రెయిన్ల వివాదం, ఇజ్రాయిల్-హమాస్‌ల వివాదం కొనసాగే అవకాశం ఉన్నందున మనదేశ తయారీ రంగంలో అత్యాధునిక సాంకేతికతను తీసుకురావడానికి ఇది గొప్ప అవకాశమన్నారు. యువకులు పరిశోధన, అభివృద్ధి సహాయంతో యుద్ధనౌకల రూపకల్పనలో ముఖ్యభూమిక పోషించాలని కోరారు. వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ ఎన్ఈపీ 2020 ప్రకారం ఆర్23 సిలబస్‌ను రూపకల్పన చేశామన్నారు. వర్సిటీ క్రీడా విభాగానికి కేంద్రం 400మీటర్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌ను మంజూరు చేసిందని తెలిపారు. వర్సిటీ పరిధిలోని 22ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలు 2023-24నుంచి స్వయంప్రతిపత్తి పొందాయన్నారు. విశ్వవిద్యాలయం సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణిత విభాగాల్లో విద్యను ప్రోత్సహించేందుకు వినూత్న కోర్సులందించే చర్యలు చేపడుతున్నామన్నారు.



గవర్నర్‌తో కలిసి స్నాతకోత్సవంలో పాల్గొన్న అతిథులు

అవార్డులు, పతకాలు ప్రదానం

స్నాతకోత్సవంలో 64మందికి పీహెచ్‌డీ అవార్డులు, 21మందికి బంగారు పతకాలను గవర్నర్, వీసీ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఈసీ సభ్యులు, రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, మాజీ వీసీలు తులసీరామ్‌దాస్, కుమార్, శ్రీనివాస్‌కుమార్, మాజీ ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయ్‌భాస్కర్, శేషారెడ్డి, కృష్ణారావు, చైతన్యరాజు, ఈసీ సభ్యులు ఎస్.చంద్రశేఖర్, బీవీవీ సత్యనారాయణ, అమీనాబి, సతీష్‌రెడ్డి, డైరెక్టర్లు సీహెచ్‌సాయిబాబు, వి.రవీంద్ర, బి.బాలకృష్ణ, ఏ.గోపాలకృష్ణ, బీటీకృష్ణ, మురళీకృష్ణ, శ్రీనివాసులు, కృష్ణమోహన్ బాలాజీ, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, రత్నకుమారి, హరిత, పీహెచ్‌డీ గ్రహీతలు, విద్యార్థులు పాల్గొన్నారు. సాయంత్రం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థినులు

ఉన్నత విద్యలో మరింత పురోగతి దిశగా..

నన్నయ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్‌నజీర్



నన్నయ విశ్వవిద్యాలయ అధికారులతో గవర్నర్ అబ్దుల్‌నజీర్



స్నాతకోత్సవానికి హాజరైన గవర్నర్, ఇతర ముఖ్య అతిథులు



మాట్లాడుతున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్



నైనాజైస్వాల్‌కు పీహెచ్‌డీ ప్రదానం

వీసీ పద్మరాజు

గవర్నర్‌కు సత్కారం

విద్యార్థికి పట్టా అందిస్తున్న గవర్నర్

దివాన్‌చెరువు/రాజానగరం, జనవరి 31: ఉన్నత విద్యలో 2035నాటికి స్థూల నమోదు నిష్పత్తిని 50 శాతం పెంచడమే జాతీయ విద్యా విధానం-2020 లక్ష్యమని రాష్ట్ర గవర్నర్, నన్నయ విశ్వవిద్యాలయ కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 13,14,15 ఉమ్మడి స్నాతకోత్సవం బుధవారం వర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనం లో బుధవారం జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గవర్నర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 900 విశ్వవిద్యాలయాలు, 40వేల కళాశాలలతో ఉన్నత విద్యావిధానంలో దేశం అతిపెద్ద నెట్‌వర్క్ కలిగి ఉందన్నారు. కానీ ఉన్నత విద్య స్థూల నిష్పత్తిలో మన దేశం కేవలం 27.29 శాతం మాత్రమే ఉందన్నారు. రానున్న 15 ఏళ్లలో ఉన్నత విద్యలో అరుదైన భాగస్వామ్యాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు ముందుకెళుతున్నాయన్నారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా సంపూర్ణ విద్యను మన రాష్ట్రం కూడా ప్రవేశపెట్టిందని చెప్పారు. నేడు ప్రపంచం వాతావరణ మార్పులతో తీవ్రమైన ముప్పును ఎదుర్కోంటుందని చెప్పారు. పర్యావరణ కాలుష్యం అనూహ్య వాతావరణ మార్పులకు దారి తీస్తోందన్నారు. విద్యావంతులైన గ్రాడ్యుయేట్లు, యువకులతో 2047 నాటికి భారతదేశం స్థిరమైన అభివృద్ధిని సాధించే దిశగా పయనింపచేయాలన్నారు. మన దేశం స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలను జరుపుకోనున్న 2047 నాటికి సమాజంలోని అన్ని అసమానతలను రూపుమాపాలన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంనుంచి పట్టాలు పొందిన విద్యార్థులు దేశ గొప్ప సంప్రదాయాలను నిలబెట్టే దిశగా కృషి చేస్తారని, చదువుకున్న విశ్వవిద్యాలయానికి సమాజంలో కీర్తి ప్రతిష్టలు తీసుకొస్తారని విశ్వసిస్తున్నానన్నారు. నన్నయ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విశ్వవిద్యాలయ అధికారులు పి.సురేష్‌వర్మ, వై.శ్రీనివాసరావు, కె.శ్రీరమేష్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాష్ట్ర గృహ నిర్మాణసంస్థ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిళారెడ్డి, చైతన్య విద్యాసంస్థల చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు), ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి పాల్గొన్నారు.

సంస్కృతిని పరిరక్షించాలి
ఇన్ఫోసిస్ చైర్‌పర్సన్ సుధామూర్తి

స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్ఫోసిస్ చైర్‌పర్సన్ సుధామూర్తి మాట్లాడుతూ మాతృభాషను తప్పక గౌరవించాలని, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలన్నారు. ఇతరుల దయాగుణం కలిగి ఉండాలని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని చెప్పారు. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథి దేవోభవ అనే సూక్తిని విద్యార్థులంతా ఆచరించాలన్నారు. ఉపనిషత్తులు, విష్ణు పురాణాల్లోని నీతి ధర్మాలను వివరించారు.

పట్టాలు ప్రదానం

దివాన్‌చెరువు/రాజానగరం, జనవరి 31: ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం 13,14,15 ఉమ్మడి స్నాతకోత్సవం సందర్భంగా ఇన్ఫోసిస్ చైర్‌పర్సన్ సుధామూర్తికి గౌరవ డాక్టరేట్‌ను, రాష్ట్ర తెలుగు సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీ పార్వతికి డి.లిట్‌ను, ఎంఏ సోషల్ వర్క్‌లో జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఎండోమెంట్ గోల్డ్ మెడల్‌ను 2021కి గానూ జక్కంపూడి విజయలక్ష్మికి రాష్ట్ర గవర్నర్, కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ ప్రదానం చేశారు. అలాగే టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్‌కు గవర్నర్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో పీహెచ్‌డీ ప్రదానం చేశారు.
విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం జరిగిన స్నాత కోత్సవంలో దరఖాస్తు చేసుకున్న 500 మందిలో పీహెచ్‌డీ 12, బంగారు పతకాలు 12, ప్రైజులు 12 అందజేశారు. మిగిలిన వారిలో ఎంఏ, ఎంకామ్, ఎంబీఏ, ఎల్ఎల్ఎం, ఎమ్మెస్సీ, ఎంసీఏ, ఎంఈడీ, ఎల్ఎల్‌బీ, బీఈడీ వంటి కోర్సులు పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. మూడు విద్యా సంవత్సరాల్లో విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో పీజీ పూర్తి చేసిన 8582 మంది, అండర్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 50,173 మంది విద్యార్థులకు పట్టాలు ఆమోదించారు. ఆర్థిక శాఖ సంయుక్త సలహాదారు డి.సురేంద్ర, రాష్ట్ర తెలుగు సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నంద మూరి లక్ష్మీపార్వతి, ఈసీ సభ్యులు పి.విజయనిర్మల, కె.నూకరత్నం, జ్యోతి, ఎం.వసంతలక్ష్మి, షేక్ సులేమాన్, జి.నారాయణరావు, జి.రాజకుమార్, వై.సత్యనారాయణ, డీన్లు కెఎస్ రమేష్, పి.సురేష్‌వర్మ, వై.శ్రీనివాసరావు, కె.రమణేశ్వరి, ఎ.మట్టారెడ్డి, ప్రిన్సిపాల్స్ డి.జ్యోతిర్మయి, పి.వెంకటేశ్వరరావు, కె.సుబ్బారావు, ఎస్.ప్రశాంతిశ్రీ, టి.అశోక్, డైరెక్టర్ వి.పెర్సిస్, సీఈ ఎస్.లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన జేసీ ప్రవీణ్ ఆదిత్య బాధ్యతల స్వీకరణ



కాకినాడ సిటీ, జనవరి 31: జిల్లా ప్రజలు, అధికారుల సహకారంతో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాకినాడ జిల్లా నూతన జేసీ సి.ప్రవీణ్ ఆదిత్య అన్నారు. పోలవరం ప్రాజెక్టు పరిపాలనాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న అయన్ను రాష్ట్ర ప్రభుత్వం కాకినాడ జిల్లా జేసీగా నియమించింది. ఈ మేరకు బుధవారం ఆయన కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ కృతికాశుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు.

డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు

- కాకినాడ కార్పొరేషన్ కమిషనర్‌గా వెంకట్రావు

కాకినాడ సిటీ, జనవరి 31: సాధారణ బదిలీల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పలువురు డిప్యూటీ కలెక్టర్‌లను బదిలీ చేసింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ కలెక్టర్ హోదాలోఉన్న జె.వెంకట్రావును కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఇంతవరకు ఎఫ్ఏసీ కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన సీహెచ్ నాగనరసింహారావు అదనపు కమిషనర్‌గా కొనసాగనున్నారు. కాకినాడసెజ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా కేవీ రామలక్ష్మి బదిలీ అయ్యారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన ఏవీఎస్ఎస్ మూర్తిని కాకినాడ సెట్రాజ్ సీఈవోగా బదిలీచేశారు. కాకినాడ హౌసింగ్ డిపార్ట్‌మెంట్ పీడీగా ఎన్‌వీవీ సత్యనారాయణ బదిలీఅయ్యారు. కాకినాడ సివిల్ సప్లయిస్ డీఎం డి.పుష్పమణిని ఏలూరు డీఆర్వోగా, కుడా వీసీ కె.సుబ్బారావును కాకినాడ దేవదాయశాఖ ఆర్జేసీగా బదిలీచేశారు. సాధారణ పరిపాలనా విభాగం డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న పి.కృష్ణమూర్తిని కుడా వీసీగా బదిలీ చేశారు.

పలువురు తహసీల్దార్‌లు బదిలీ

జోన్-2 ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 62మంది తహసీల్దార్లను బదిలీ చేశారు. కాకినాడ జిల్లాకు సంబంధించి కలెక్టరేట్ ఏవో జీఎస్ఎస్ శ్రీనివాస్, కరప తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, కాజులూరు తహసీల్దార్ బి.సాయి సత్యనారయణ, శంఖవరం తహసీల్దార్ కె.సుబ్రహ్మణ్యం, కాకినాడ జిల్లా భూసేకరణ స్పెషల్ తహసీల్దార్ ఎం.ముస్తాఖ్ అహ్మద్ బదిలీ అయ్యారు.

ఒప్పించేశారు

- కాకినాడ ఎంపీ సీటుకు వైసీపీ అభ్యర్థిగా చలమశెట్టి సునీల్
- అధికారికంగా ఐదో జాబితాలో పేరు ప్రకటించిన అధిష్ఠానం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడ ఎంపీ అభ్యర్థిగా చలమశెట్టి సునీల్‌ను వైసీపీ అధిష్ఠానం ఖరారు చేసింది. ఈ మేరకు బుధవారం రాత్రి విడుదల చేసిన ఐదో జాబితాలో పేరు ప్రకటించింది. దీంతో వైసీపీకి ఎంపీ అభ్యర్థి వెదుకులాట సమస్య తీరినట్లయింది. కొన్నినెలలుగా ఎంపీ అభ్యర్థి ఎవరూ దొరక్క వైసీపీకి తలనొప్పి ఎక్కువైంది. ఈస్థానంనుంచి పోటీ చేయడానికి పార్టీనేతలు ముందుకు రాకపోవడంతో ఎవరిని బరిలోకి దించాలో అర్థంకాక మల్లగుల్లాలు పడింది. ఇప్పటికే జిల్లాలో మూడు స్థానాల్లో సిట్టింగ్‌లను పీకిపారేసిన అధిష్ఠానం పిఠాపురం సీటుకు ప్రస్తుత ఎంపీ వంగా గీతను ఖరారు చేసింది. ఈ నేపథ్యంలో ఖాళీ అయిన ఎంపీ సీటుకు పలువురు ఎమ్మెల్యేలను ఎంపిక చేసినా వారంతా ససేమిరా అన్నారు. తుని, పిఠాపురం ఎమ్మెల్యేలు దాడిశెట్టి రాజా, పెండెం దొరబాబుపై ఒత్తిడి తెచ్చినా బాబోయ్ అనేశారు. దీంతో ఇటీవల వరుసగా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కన్నబాబును తాడేపల్లికి పిలిచి ఎంపీగా బరిలోకి దిగాలని కోరారు. కానీ అంతఖర్చులు భరించలేక ఆయన కూడా చేతులెత్తేశారు. ఈ నేపథ్యంలో తాజాగా చలమశెట్టి సునీల్‌పై ఒత్తిడి తెచ్చారు. పార్టీ జిల్లా పరిశీలకుడు మిథున్‌రెడ్డి పలుసార్లు ఫోన్ చేసి సునీల్‌ను బరిలోకి దిగాలని కోరారు. కానీ కాకినాడ ఎంపీ స్థానం నుంచి మూడుసార్లు వరుసగా ఓడిపోవడంతో పోటీకి ససేమిరా అన్నారు. కానీ బుజ్జగించి, బతిమాలి, ఒత్తిడి తెచ్చి ఆయన్ను ఎట్టకేలకు ఒప్పించారు. ఈ మేరకు పేరును అధికారికంగా ఖరారు చేశారు.

ఎంపీ అభ్యర్థి విషయంలో చలమశెట్టి సునీల్‌పైనే వైసీపీ పెద్దలు దృష్టిసారించారు. ఆయన్ను ఒప్పించి బరిలోకి దించడానికి రెండునెలలుగా ప్రయత్నాలు చేశారు. ఇప్పటికే 2009, 2014, 2019 ఎన్నికల్లో మూడుసార్లు ఇక్కడి నుంచి పోటీ చేసి సునీల్ వరుసగా ఓటమిపాలయ్యారు. ఈ నేపథ్యంలో ఎంపీ సీటు తనకు అచ్చిరాలేదని, పోటీకి ఆసక్తి లేదని తెగేసి చెప్పేశారు. కుదిరితే రాజ్యసభకు వెళ్లడానికి అంగీకారం తెలిపారు. వారం కిందట జగన్ పిలిపించుకుని మాట్లాడారు. ఈ ఒక్కసారి బరిలోకి దిగాలని బలవంతం చేశారు. ఈ మేరకు ఖర్చుల అంశంపైనా చర్చలు జరిపినట్లు తెలిసింది. జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాల ఖర్చు భరించేలా మాటలు జరిగినట్లు సమాచారం. తప్పనిసరి పరిస్థితుల్లో వైసీపీ అధిష్ఠానం ఒత్తిడితో ఇష్టం లేకున్నా బరిలోకి దిగడానికి సునీల్ అంగీకరించారు. రాయలసీమలో సునీల్ కుటుంబానికి చెందిన గ్రీన్‌కో కంపెనీకి సోలార్ విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి భూముల కేటాయింపు, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, ఇతర అనుమతులు రాష్ట్రప్రభుత్వం జారీచేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో పోటీకి అంగీకరించకపోతే ఏ ఇబ్బందులు వస్తాయోననే భయం సునీల్‌ను వెన్నాడింది. ఉమ్మడి తూ.గో. జిల్లాలో చిన్న ఖనిజాలకు సంబంధించి లాయల్టీ వసూలు కాంట్రాక్టు గతేడాది సునీల్ దక్కించుకున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వంనుంచి పలురకాల లబ్ధి పొందిన నేపథ్యంలో ఇష్టం లేకున్నా పెద్దల ఒత్తిడితో బరిలోకి దిగడానికి అంగీకరించారు. దీంతో సునీల్‌ను ఎంపీ అభ్యర్థిగా వైసీపీ ప్రకటించింది.

సెబ్ ఏఎస్పీగా శ్రీలక్ష్మి



కాకినాడ క్రైం, జనవరి 31: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) అడిషనల్ ఎస్పీగా కె.శ్రీలక్ష్మిని నియమిస్తూ రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన డాక్టర్ జి.ప్రేమ్‌కాజల్ శ్రీకాకుళం అడ్మిన్ ఎస్పీగా బదిలీఅయ్యారు. శ్రీలక్ష్మి 2012 గ్రూప్-1 బ్యాచ్‌కు చెందినవారు. ఆమె డీఎస్పీగా తెలంగాణ సీఐడీ విభాగంలో పనిచేసి 2016లో ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌లో కదిరి, తెనాలి తదితర ప్రాంతాల్లో పనిచేశారు. అనంతరం ఏఎస్పీగా పదోన్నతి పొందిన ఆమె నెల్లూరు సెబ్, చిత్తూరు సెబ్ విభాగాల్లో పనిచేశారు.

అడ్మిన్ ఏఎస్పీగా భాస్కర్రావ్

కాకినాడ జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్)గా ఎంవీవీ భాస్కర్రావ్‌ను నియమిస్తూ డీజీపీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన పి.శ్రీనివాస్ ఎస్‌సీజెడ్ ఎస్పీగా చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. భాస్కర్రావ్ 1989 ఎస్ఐ బ్యాచ్‌కు చెందినవారు. ఆయన ఎస్ఐగా, సీఐగా, డీఎస్పీగా పశ్చిమగోదావరి, రాజమహేంద్రవరంల్లో పనిచేశారు. ఏఎస్పీగా పదోన్నతి పొందిన ఆయన ఏలూరు జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్)గా పనిచేస్తూ బదిలీ పై కాకినాడ జిల్లాకు రానున్నారు.

గవర్నర్‌కు ఘనస్వాగతం



హెలీప్యాడ్‌వద్ద గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న తూర్పుగోదావరిజిల్లా కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్

రాజానగరం/దివాన్‌చెరువు, జనవరి 31: జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు హెలీప్యాడ్ వద్ద ఘన స్వాగతం లభించింది. కాకినాడలో పర్యటన ముగించుకుని హెలికాప్టర్‌లో గైట్‌లోని హెలీప్యాడ్‌కు బుధవారం మధ్యాహ్నం 1.10 గంటలకు చేరుకున్నారు. అక్కడ జిల్లా కలెక్టర్ కె.మాధవీలత, ఎస్పీ పి.జగదీష్, జేసీ ఎన్.తేజ్‌భరత్, నన్నయ వీసీ ఆచార్య కె.పద్మరాజు, ఆర్డీవో కె.చైత్రవర్షిణి, అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ శేఖరరాజు, చైతన్య విద్యాసంస్థల చైర్మన్ కెవివి సత్యనారాయణరాజు(చైతన్యరాజు), బీజేపీ నాయకులు నీరుకొండ వీరన్న చౌదరి గవర్నర్‌కు ఘన స్వాగతం పలికారు. చైతన్యరాజు గవర్నర్‌ను ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. అనంతరం విశ్వవిద్యాలయంలోని వసతి గృహానికి చేరుకున్నారు. స్నాతకోత్సవ వేదిక వద్ద గవర్నర్ గౌరవ వందనం స్వీకరించారు.

ఎన్నికల నేపథ్యంలో

పలువురు అధికారుల బదిలీలు

- కొందరు సాధారణ బదిలీలు
- 13మంది ఎండీవోలు, పలువురు తహశీల్దార్లు ఇతర జిల్లాలకు

రాజమహేంద్రవరం, జనవరి31(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మూడేళ్ల దాటి జిల్లాలో పనిచేస్తున్న పలువురు అధికార్లు బదిలీ అయ్యారు. ఎంపీడీవోలు, తహశీల్దార్‌లను ఇతర జిల్లాలకు కేటాయించారు. ఇంకా పోస్టింగ్‌లు ఇవ్వలేదు.ఇక రుడా సెక్రటరీ విశాఖపట్నం కార్పొరేషన్‌లో పనిచేసి ఎ.చంద్రిక నియమితులయ్యారు. ఇక్కడి సెక్రటరీ జి.శైలజ విశాఖ జోనల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. నిడదవోలు కమిషనర్‌గా పిఠాపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న టిఎల్‌పిఎస్ఎస్ కృష్ణవేణి నియమితులయ్యారు. నిడదవోలు కమిషనర్ కె.వి.పద్మావతి పెద్దాపురం కమిషనర్‌గా నియమితులయ్యారు. పోలవరం ఎల్ఎంసి భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ (కొవ్వూరు)గా ఆర్.వెంకటరమణ నాయక్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన ఎం.ఝాన్సీ రాణి కోనసీమ జిల్లా ఐసీడీఎస్ పీడీగా నియమితులయ్యారు. తూర్పుగోదావరి సివిల్ సప్లయిస్ డీఎంగా తిరువీదేదుల రాధిక నియమితులయ్యారు. ఇటీవల ఇక్కడ డీఎం ముందుగానే బదిలీ అయ్యారు. గోపాలపురం ఓఎన్‌జిని భూసేకరణ ఆర్వోగా కె.లక్ష్మీ శివ జ్యోతి నియమితుల య్యారు. రాజమహేంద్రవరం గెయిల్ పరిధిలోని శ్రీకాకుళం. అంగుల్ గ్యాస్ పైపులైన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఎం.మాధురి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన ఎబివిఎస్‌బి శ్రీనివాస్ బదిలీ అయ్యారు.

రెవెన్యూశాఖలో.. రాజమహేంద్రవరం కలెక్టరేట్ ఏఓగా ఏలూరు కలెక్టరేట్ ఏవో బి.రమాదేవి, ఉండ్రాజవరం తహశీల్దార్ జి.కనకరాజు రాజమహేంద్రవరం తహశీల్దార్‌గానూ, తాళ్లపూడి తహశీల్దార్ కోనసీమ కు, పెరవలి తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి రాజమహేంద్రవరానికి, దేవరపల్లి తహశీల్దార్ కృష్ణాకు, గోపాలపురం తహశీల్దార్ కృష్ణాకు కొవ్వూరు తహశీల్దార్ బి.నాగరాజునాయక్ రాజమహేంద్ర వరానికి బదిలీ అయ్యారు. జిల్లాలో 13మంది ఎంపీడీవోలను ఇతర జిల్లాలకు కేటాయించారు. డీపీవో జె.సత్యనారాయణ బదిలీ అయ్యారు.

ఏజెన్సీ నుంచి 9 మంది తహశీల్దార్ల బదిలీ

రంపచోడవరం: ఏజెన్సీలోని రంపచోడవరం, ఎటపాక రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 9 మంది తహశీల్దార్లను ఇతర జిల్లాలకు బదిలీ చేస్తూ భూ పరిపాలనా చీఫ్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. వారి వివరాలు ఇలా ఉన్నాయి. రంపచోడవరం సబ్ కలెక్టరు కార్యాలయం పరిపాలనాధికారిణి ఎమ్.సావిత్రి, వై.రామవరం తహశీల్దారు సీహెచ్ శ్రీనివాసరావు, రాజవొమ్మంగి తహశీల్దారు వై.వి.ఎస్.ఆచారిని రాజమహేంద్రవరం జిల్లాకు, అడ్డతీగల తహశీల్దారు ఎ.తాతారావు, రంపచోడవరం తహశీల్దారు పీవీవీజె సూర్యకుమార్‌కు భీమవరం జిల్లాకు, మారేడుమిల్లి తహశీల్దారు టి.శ్రీనివాసరావు, దేవీపట్నం తహశీల్దారు కె.సత్యనారాయణ, కూనవరం తహశీల్దారు కె.అనసూయ, చింతూరు తహశీల్దారు కె.సుబ్బారావును కృష్ణా జిల్లాకు బదిలీ చేశారు. వీరి స్థానాల్లో వేరే జిల్లాల నుంచి ఉమ్మడి తూర్పు, విశాఖ జిల్లాలకు వచ్చిన తహశీల్దార్లను కేటాయించాల్సి ఉంది.

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు

ఏపీ జట్టు ఎంపిక



జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ జట్టు

పిఠాపురం, జనవరి 31: జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టును బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు బుధవారం ప్రకటించారు. కాకినాడజిల్లా పిఠాపురంలోని పాతబస్టాండ్ వద్దగల బాస్కెట్‌బాల్ క్రీడామైదానంలో రెండు వారా లుగా జరుగుతున్న నేషనల్ బాస్కెట్‌బాల్ జూనియర్స్ బాలుర కోచింగ్ క్యాంప్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా క్రీడాకారులను ఎంపిక చేశారు. ఏపీ జట్టులో జి.సత్యప్రకాష్, కె.ద్వారకానాథ్‌రెడ్డి, వి.అఖిల్‌కుమార్, రాహుల్, ఎం.గురుచరణ్, వై.పవన్‌కుమార్, సీహెచ్.ఫణీంద్ర, ఎస్.స్నేహిత్, ఏ.తేజ, జి.నగేష్‌బాబు, బి.దేవందర్ సాయి, ఎస్‌కే అర్షద్‌బాషాలు ఎంపిక కాగా స్టాండ్‌బైలుగా జి.అమిత్ ఆర్యా, పి.పవన్‌కుమార్‌రెడ్డి, పి.చైతన్య ఉంటారు. ఎంపిక ప్రక్రియను అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నమనేని చక్రవర్తి, జా యింట్ సెక్రటరీ బొజ్జా మాణిక్యాలరావు, ఎంపిక కమిటీ అధ్యక్షుడు నడింపల్లి అప్పలరాజు, కోచ్ ఎంఎ రుద్ర, జిల్లా కమిటీ సభ్యుడు కొత్తెం సుందరకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులకు రాష్ట్ర అసోసియేషన్ తరఫున కిట్లను మునిసిపల్ కమిషనర్ కనకారావు, పాదగయ చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, బొజ్జా దొరబాబు, కౌన్సిలర్లు పెదపాటి నాగేశ్వరరావు, మఠం లోవ రాజు తదితరులు అందజేశారు.

ప్రతిభకు పురస్కారం

- జేఎన్టీయూకే స్నాతకోత్సవంలో పలువురికి పీహెచ్‌డీలు, బంగారు పతకాలు



జేఎన్‌టీయూకే వీసీ, అతిథులతో పీహెచ్‌డీ గ్రహీతలు

జేఎన్టీయూకే, జనవరి 31: కాకినాడ జేఎన్టీయూకే పదో స్నాతకోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వర్సిటీ కులపతి, రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ నుంచి 64మంది పీహెచ్‌డీ అవార్డులు, 28మంది బంగారు పతకాలు అందుకున్నారు. వారిలో కొందరి అభిప్రాయాలు ఇవి..

కుల వ్యవస్థ, లింగ అసమానతలపై పరిశోధన చేశాను

● ఎం.జయ, పీహెచ్‌డీ



కుల వ్యవస్థ, లింగ అసమానతలు ఇంకా మన దేశంలో వేళ్లూనికుని ఉన్నాయి. అగ్ర కులస్థులు దళితులపై జరుపుతున్న దాడులకు అంతులేకుండా పోతోంది. ముఖ్యంగా దళిత స్త్రీలు భూస్వాముల చేతిలో అరాచకాలకు బలైపోతున్నారు. విద్యకు దూరమై ఇంటా బయట సమస్యల వలయంలో చిక్కుకుంటున్నారు. అందుకే కులవ్యవస్థ, లింగ అసమానతలపై పరిశోధన చేశాను. గవర్నర్ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకోవడం చాలా సంతోషంగా ఉంది.

అల్జీమర్స్ వ్యాధిపై పరిశోధన

● కె.ఝాన్సీ రాణి, పీహెచ్‌డీ



మెదడులోని నిర్మాణాల ద్వారా ఇమేజెస్‌తో అల్జీమర్స్ వ్యాధికి సంబంధించి జ్ఞాపకశక్తి ఎలా తగ్గిపోతుందో అనే అంశంపై పరిశోధన చేశాను. ప్రస్తుతం జేఎన్టీయూకేలోని ఈసీఈ ఇంజనీరింగ్ విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నాను. పీహెచ్‌డీ పట్టాను గవర్నర్ నుంచి అందుకోవడం నా జీవితంలో మరచిపోలేనిది.

లిక్విడ్ క్రిస్టల్స్‌పై పరిశోధన

● ఎం.సురేఖ, పీహెచ్‌డీ



భౌతికశాస్త్రంలో లిక్విడ్ క్రిస్టల్స్‌పై పరిశోధన చేశాను. దీనిద్వారా ఎల్‌సీడీ టీవీలోని దృశ్యాన్ని ఏవైపు నుంచైనా చూడవచ్చు. నా భర్త, మావయ్య ప్రోత్సాహం, ఆసక్తితో పీహెచ్‌డీ పూర్తి చేశాను. పీహెచ్‌డీ పట్టాను స్నాతకోత్సవంలో అందుకోవడం చాలా సంతోషంగా ఉంది.

సివిల్‌లో పీహెచ్‌డీ సాధించా

● జి.వెంకటరామాంజనేయులు, పీహెచ్‌డీ



సివిల్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ సాధించడం ఆనందంగా ఉంది. ఉష్ణోగ్రత పెరిగినా, తగ్గినా ఒత్తిడి పెరుగుతుంది. దానివల్ల ఇనుప లోహంలో పగుళ్లు ఎన్నిరోజుల్లో పడతాయో అనేదానిపై పరిశోధన చేశాను.

పీహెచ్‌డీ నా జీవితాశయం

● ఎం.ప్రియదర్శిని, పీహెచ్‌డీ



ఫార్మసీలో పీహెచ్‌డీ సాధించడంతో నా జీవితాశయం నెరవేరింది. పీహెచ్‌డీని కుటుంబసభ్యుల సమక్షంలో తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఫార్మసీలో సాల్యుబిలిటీ డిసొల్యూషన్ రేటు పెంపుదల ఫార్ములేషన్ అభివృద్ధిపై పరిశోధన చేశాను. పీహెచ్‌డీ పొందడం నా జీవితంలో మధురమైన ఘట్టంగా నిలిచిపోతుంది.

బంగారు పతకాలు

మార్కులకోసం చదవకూడదు

-పి.సంధ్య, బంగారు పతకం



మార్కులకోసం కాకుండా సబ్జెక్టు పరంగా చదివితే విజయం సాధించవచ్చు. సివిల్‌లో బంగారు, అల్లం అప్పారావు ఎండోమెంట్ పతకాలు సాధించాను. చాలా సంతోషంగా ఉంది.

మా నాన్న నాకు స్ఫూర్తి

-ఎ.జయసురేఖ, బంగారు పతకం



నేను ఈఈఈలో బంగారు పతకం సాధించడానికి మా నాన్న నాకు స్ఫూర్తి. ప్రస్తుతం జేఎస్‌డబ్ల్యూలో ఉద్యోగం చేస్తున్నాను. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లోఎంపికయ్యాను.

సీఎస్ఈలో బంగారు పతకం సాధించాను

-ఎన్ఎస్పీ శ్రీవాణి సాగరి, బంగారుపతకం



సీఎస్ఈ విభాగంలో 8.6 సీజీపీ పాయింట్లు సాధించి టాపర్‌గా నిలిచి బంగారుపతకం సాధించాను. ప్రస్తుతం హైదరాబాద్‌లోని యునైటెడ్ ఆన్‌లైన్‌లో ఉద్యోగం చేస్తున్నాను. నా తల్లిదండ్రులు ఎంతో ప్రోత్సహించారు.

కోడింగ్ నేర్చుకోవాలి

-కె.వాస్తవి, బంగారు పతకం



విద్యార్థులు స్టాండర్డ్ పుస్తకాలు చదివి కోడింగ్ నేర్చుకుంటే ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా లభిస్తాయి. ఈసీఈలో బంగారు పతకం, నగదు బహుమతిని పొందడం ఆనందంగా ఉంది. నన్ను తల్లిదండ్రులు ప్రోత్సహించారు.

బీమా సొమ్ముల కోసం..

చనిపోయినట్లు నాటకం

- పాతవీరంపాలెంలో ఓ వ్యక్తి నిర్వాకం ● ప్రధాన నిందితుడి సహా నలుగురి అరెస్టు



రంగంపేటలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్ డీఎస్పీ

రంగంపేట, జనవరి 31: బీమా సొమ్ములకు కక్కుర్తి పడి చనిపోయినట్టు నాటకమాడిన ఓ వ్యక్తితో పాటు అతడికి సహకరించిన నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. గత నెల 26న రంగంపేట మండలం పాతవీరంపాలెంలో పూర్తిగా కాలిపోయిన గుర్తు తెలియని మృతదేహం అంటూ దినపత్రికల్లో ఓవార్త ప్రచురితమైంది. ఈ కేసుకు సంబ oదించి బుధవారం రంగంపేట పోలీస్‌స్టేషన్‌లో రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. సదరు ఘటనపై విచారణకు డిఎస్పీ ఎం.కిషోర్‌కుమార్, అనపర్తి సీఐ శివగణేష్ రెండు బృందాలుగా దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో చనిపోయాడనుకున్న కేతమళ్ళ వెంకటేశ్వరరావు(పూసయ్య) బతికున్నట్టు తెలుసుకుని అతడిని స్టేషన్‌కు పిలిపించి విచారించగా.. గత నెల 26న తెల్లవారుజామున తాను పొలంలోకి వెళ్తుండగా ముగ్గురు వ్యక్తులు ఆటోలో వచ్చి కేతమళ్ల గంగారావు పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఓ శవాన్ని పడేసి నిప్పు అంటించడం చూసి వారిని వెంబడించి పట్టుకోవడానికి ప్రయత్నించగా వారు తనను గాయపరిచి అపస్మారక స్థితిలోకి వెళ్లి న తర్వాత ఆటోలో ఎక్కించుకొని రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యి గ్రామంలోని పొలాల వద్ద వదిలేసి వెళ్లిపోయినట్టు చెప్పాడు. అయితే పోలీసులు సీసీ కెమెరా ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు, ఐటీ కోర్ టీం సహాయంతో పూసయ్య చెప్పినదంతా అబద్ధమని గుర్తించారు. ఆపై తమదైన శైలిలో విచారించగా నేరాన్ని అంగీకరించాడు. తాను ఎల్ఐసీ పాలసీని రెండు నెలల క్రితం తీసుకున్నానని, పాలసీ ప్రకారం సాధారణ మరణమైతే రూ.20లక్షలు, ప్రమాద మరణమైతే రూ.40 లక్షల వస్తాయని భావించాన్నాడు. తాను చనిపోయినట్టుగా సమాజాన్ని, ఇన్సూరెన్స్ కంపెనీని నమ్మించి మోసం చేద్దామనే ఉద్దేశ్యంతో ఎవరైనా చనిపోయిన మగ వ్యక్తిని తీసుకు రమ్మని, అలా తీసుకొస్తే.. అది కరెంట్ షాక్ తగిలి చనిపోయినట్టు(యాక్సిడెంట్ డెత్)గా చిత్రీకరించి ఎల్ఐసీ ఇన్సూరెన్స్ పొందవచ్చునని పథకం వేశాన్నాడు. ఈ మేరకు తన స్నేహితుడైన హుకుంపేటకు చెందిన వందే శ్రీనుకు రూ.10 వేలు ఇచ్చి ఆ పని అప్పగించగా.. శ్రీను శ్మశానాలవద్ద గోతులు తవ్వే హుకుంపేటకు చెందిన తలారి సుబ్బారావు, మోరంపూడికి చెందిన చీర చిన్నిలకు ఆ పని అప్పజెప్పాడు. ఆ ముగ్గురు 25వ తేదీ అర్ధరాత్రి పాత బొమ్మూరు శ్మశావాటిక నుంచి మగ శవాన్ని దొంగిలించి శ్రీను కారులో ఎక్కించుకొని రంగంపేట మండలం పాత వీరంపాలెంలోని కేతామళ్ల గంగారావు పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు తీసుకొచ్చారు. అనంతరం నలుగురు కలిసి నిప్పు అంటించినట్టు పూసయ్య చెప్పాడని డీఎస్పీ వివరించారు. ఆశవం ఎవరిదో దర్యాప్తు చేసి వారి బంధువులకు పంచనామాచేసి అనంతరం అప్పగిం చినట్టు పోలీసులు చెప్పారు. ఈ కేసులో పూసయ్యను ఎ1 నిందితుడిగా చేర్చామన్నారు. నిందితులు నలుగురిని ఈనెల 30న అరెస్ట్ చేసి, రిమాండ్‌కి పంపామని డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ తెలిపారు. అనపర్తి సీఐ శివగణేష్, రంగంపేట ఎస్ఐ పి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలెన్ని

- 50వేల పోస్టులు ఖాళీ అని కేంద్రానికి చెప్పిన మాట వాస్తవం కాదా
- జగన్‌ను సూటిగా ప్రశ్నించిన ఎమ్మెల్సీ ఐవీ



అమలాపురం టౌన్, జనవరి 31: రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఎన్ని ఉన్నాయో స్పష్టం చేయాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) ప్రశ్నించారు. రాష్ట్రంలో సుమారు 50వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్రానికి చెప్పిన మాట వాస్తవమా కాదా అన్నారు. అసలు ఈ లెక్కల మతలబులేమిటో స్పష్టం చేయాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని యూటీఎఫ్ హోంలో బుధవారం జరిగిన సమావేశంలో ఐవీ మాట్లాడారు. 6,100 పోస్టులతో డీఎస్సీ వేస్తామని రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రకటించడంపై ఆయన పలు అనుమానాలు వ్యక్తం చేశారు. 2018లో డీఎస్సీ వేశారని తిరిగి ఆరేళ్ల తరువాత రాష్ట్రంలో 6వేల పోస్టులే ఖాళీగా ఉన్నాయా అన్నారు. చరిత్రలో ఐదేళ్లకు ఒక్క డీఎస్సీ కూడా వేయని సీఎంగా జగన్ చిరస్థాయిగా నిలుస్తారన్నారు. పాదయాత్ర నాటికి రాష్ట్రంలో 23వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే చంద్రబాబు ఏం చేస్తున్నారని జగన్ ప్రశ్నించిన మాట వాస్తవమా కాదా అని నిలదీశారు. మరి ఈ ఐదేళ్లలో ఈ డీఎస్సీ కూడా ఎందుకు వేయలేదన్నారు. విభజన ఏపీకి వచ్చిన ఉపాధ్యాయ పోస్టులు ఎన్ని, ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎంతమందో చెప్పాలన్నారు. 18,680 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పి 6,100 పోస్టులతో డీఎస్సీ ప్రకటించడం ఏమిటన్నారు. లక్షలాది మంది డీఎస్సీ కోసం ఎదురుచూస్తుంటే వారి ఆశలన్నీ అడియాశలు చేశారన్నారు. మరోవైపు 1994లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దుర్మార్గమైన అప్రంటీస్ విధానాన్ని 15 ఏళ్లపాటు ఉపాధ్యాయ సంఘాలు పోరాటాలు చేసి రద్దు చేయించుకుంటే నేడు మళ్లీ వైసీపీ ప్రభుత్వం అదే విధానాన్ని తీసుకురావడం సిగ్గుచేటన్నారు. అప్రంటీస్ విధానం అమలు చేస్తామన్న ప్రకటనను ప్రభుత్వం తక్షణం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉపాధ్యాయులనే నియమించాలన్నారు.

4న జడ్పీ సర్వసభ్య, స్టాండింగ్ కమిటీల సమావేశాలు

కాకినాడ సిటీ, జనవరి 31: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ సర్వ సభ్య సమావేశం, స్టాండింగ్ కమిటీల సమావేశాలు ఫిబ్రవరి 4వ తేదీన నిర్వహిస్తున్నట్లు జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఏ రమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి కాకినాడ జిల్లాపరిషత్ కార్యాలయంలోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో జరుగుతాయని తెలిపారు. 3వ తేదీన జరగాల్సిన ఈ సమావేశాలు అనివార్య కారణాల వల్ల 4వ తేదీకి మార్చడం జరిగిందని ఆయన తెలిపారు.

కాకినాడ తీరంలో ముగిసిన జల ప్రహార్ సైనిక విన్యాసాలు





బీచ్‌లో పొజిషన్ తీసుకుంటున్న సైనికులు, యుద్ధ నౌక ఎల్ 23 నుంచి రోప్‌లతో చిన్నబోటులోకి దిగుతున్న సైనికులు

సర్పవరం జంక్షన్, జనవరి 31: కాకినాడ సాగరతీరం సూర్యారావుపేట నావెల్ ఎన్‌క్లేవ్‌లో భారత తూర్పు నావికా దళం, ఆర్మీల సంయుక్తంగా నిర్వహించిన బైయాన్యువల్ జాయింట్ ఎక్సర్‌సైజ్ విన్యాసాలు మంగళవారంతో ముగిశాయి. డీప్ సముద్రంలో గత తొమ్మిదిరోజులుగా ఇండియన్ నేవీ, ఆర్మీల జాయింట్‌గా యాంపిబియాస్ యూనిట్స్ ఆఫ్ ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఇంటిగ్రేటెడ్ ట్రూప్స్, ఇన్ పేంటీ బ్రిగే ఇండియన్ ఆర్మీలు సైనిక విన్యాసాలు నిర్వహించారు. విన్యాసాల్లో భాగంగా వైమానికం యుద్ధవిమానాలు, యుద్ధ నౌక, యుద్ధ ట్యాంకులు, ఆర్మీ సైనికులు తమ సైనిక విన్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యుద్ధం, తుపాన్లు, విపత్తు, భూభాగంలోకి అక్రమచొరబాట్లు, ఆపద సమయాల్లో సము ద్రం, ఆకాశయానం, భూమిపై నుంచి యుద్ధ సమయంలో శత్రుదేశాలపై త్రివిధ దళాలు చేపట్టే కసరత్తును గత తొమ్మిది రోజులుగా డీప్ సీలో నిర్వహించారు.

సత్యదేవుడి హుండీల ఆదాయం రూ. 1.70 కోట్లు



హుండీలలో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అన్నవరం, జనవరి 31: సత్యదేవుడికి భక్తులకు హుండీలలో సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించగా రూ.1,70,15,123 నగ దు, 40 గ్రాముల బంగారం, 1020 గ్రాముల వెండి సమకూరాయి. వీటితోపాటుగా యుఎస్‌ఏ 291 డాలర్లు, సింగపూర్ 26, యుఏఈ 30 దిరహమ్స్, సౌదీఅరేబియా 212 డాలర్లు లభించాయి. 36 రోజులకు ఈ ఆదాయం లభించగా సరాసరిన రోజుకు రూ.4.72 లక్షలు భక్తుల హుండీలలో కానుకల రూపంలో వేశారు. లెక్కింపును ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్‌లు పర్యవేక్షించగా సిబ్బంది, పురోహితులు, నాయీబ్రాహ్మణులు లెక్కించారు.

'ఆంధ్రజ్యోతి' చొరవతో వృద్ధుడికి వైద్యం

- నిర్లక్ష్యం వహించిన వైద్యులపై కలెక్టర్ సీరియస్



బుధవారం వార్డులో చికిత్స పొందుతున్న వృద్ధుడు

రాజమహేంద్రవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రి వద్ద 57ఏళ్ల వృద్ధుడిని అర్ధరాత్రివేళ చలిలో బయట వదిలేయడంపై 'రాజమహేంద్రవరం ఆసుపత్రి వద్ద చలిలోనే వృద్ధుడు' అనే శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి' మెయిన్ ఎడిషన్‌లో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మీ సూర్యప్రభపై కలెక్టర్ మాధవీలత ఫోన్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో ఏం జరుగుతోందంటూ ప్రశ్నించారు. ఇలాంటి విషయాలు తన దృష్టికి కచ్చితంగా తీసుకురావాలని, వృద్ధుడికి పూర్తిస్థాయి వైద్యం అందించాలని ఆదేశించారు. దీంతో అతడికి మెడికల్ వార్డులో బెడ్ కేటాయించి రక్త పరీక్షలు చేశారు. సెలైన్ పెట్టి మందులు ఇచ్చారు. ఎంఆర్ఐ స్కానింగ్‌కి, కళ్లకు చికిత్స కోసం నేత్ర వైద్యుడికి రిఫర్ చేశారు. చాన్ బాషా అనే యాచకుడు కంటి వైద్యం కోసం నంద్యాల నుంచి తమిళనాడులోని మదురై వెళ్లాడు. ఏడాది యాచించి దాచుకున్న రూ.36వేలు తన కూడా తీసుకెళ్లాడు. మదురై వెళ్లాక డబ్బులు ఇంకా ఎక్కువ అవసరమని తెలియడంతో అక్కడి వాళ్ల సలహా మేరకు పాండిచ్చేరి వెళ్లడానికి రైలెక్కాడు. రైలులో తనను ముగ్గురు నలుగురు తీవ్రంగా కొట్టి డబ్బులు లాక్కొని ప్లాట్‌ఫాంపై పడేశారని వృద్ధుడు చెప్పాడు. ఎలాగోలా రైలెక్కి రాజమండ్రిలో దిగిపోయాడు. నెమ్మదిగా జాంపేట మసీదు వద్దకు చేరుకొని బిక్షాటన చేస్తున్నాడు. అయితే, గుర్తు తెలియని వ్యక్తులు రైలులో కొట్టడంతో గాయాలై బాధ పడుతుండడంతో స్థానికులు ఈ నెల 24న రాత్రి 8గంటల ప్రాంతంలో ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. బుధవారం(30న) వైద్యులు డిశ్చార్జి రాయగా అర్ధరాత్రి అతడిని సిబ్బంది వీల్‌చైర్‌లో ఆస్పత్రి నుంచి బయటకు తీసుకొస్తుండగా వీల్‌చైర్ గోతిలో పడడంతో ఇతడు కింద పడిపోయాడు. తనకు వైద్యం చేయకుండా ఎవరి వద్దకు పంపుతు న్నారంటూ ప్రశ్నించాడు. విషయం తెలుసుకున్న 'ఆంధ్రజ్యోతి' వెళ్లి వివరాలు సేకరించి, వృద్ధుడి పట్ల అర్ధరాత్రి వేళ ఈ తీరు సరికాదని నిలదీయడంతో ఆ వృద్ధుడిని ఆస్పత్రిలోకి తరలించారు. కనీస మానవత్వం లేకుండా సంబంధీకులు ఎవరూ లేని వృద్ధుడిని అర్ధరాత్రి వేళ ఆస్పత్రి సిబ్బంది ఎక్కడి తరలిస్తున్నారనే ప్రశ్నకు సమాధానం కరువైంది. కాగా.. ఆ వృద్ధుడికి ఇక్కడ ఎవరూ లేకపోవడంతో దుస్తులు కూడా దుర్వాసన వస్తున్నాయి. దాతలు ఆదుకోవాలని అతడి దుస్థితి చూసినవారు విజ్ఞప్తి చేస్తున్నారు.

బ్లేడ్‌తో వ్యక్తిపై దాడి

గోకవరం, జనవరి 31: బ్లేడ్ బ్యాచ్ సంస్కృతి పట్టణాల నుంచి పల్లెలకు పాకుతోంది. ఇప్పటివరకు రాజమహేంద్రవరం వెళ్లి రావాలంటే ప్రాణాలను అరిచేతిలో పెట్టుకొని ప్రయాణాలు సాగిస్తున్న ప్రయాణికులకు తాజాగా గోకవరంలో జరిగిన సంఘటన మరింత భయభ్రాంతులకు గురిచేస్తోంది. గోకవరం పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న ఓ రెస్టారెంట్‌లో పని చేసే వ్యక్తిపై బుధవారం రాత్రి బ్లేడ్‌తో ముగ్గురు యువకులు దాడిచేసి గాయపర్చారు. ఈ సంఘటనపై బాధితుడు పోలీసులను ఆశ్రయించినట్లు తెలియవచ్చింది. మండలంలోని కామరాజుపేటకు చెందిన ములపర్తి రాజు కొంతకాలంగా గోకవరంలోని ఓ రెస్టారెంట్‌లో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గోకవరం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు బిర్యానీ కోసం రెస్టారెంట్‌కు వెళ్ళారు. ఆ సమయంలో బిర్యానీ రేటు విషయంలో రాజుకు ఆ ముగ్గురు యువకుల మధ్య వాగ్వాదం జరిగింది. అప్పటికే మద్యంమత్తులో ఉన్న ఆ ముగ్గురు.. రాజుపై బ్లేడుతో దాడిచేసి వీపు, మెడ, చెయ్యి తదితర భాగాలలో గాయపర్చినట్లు బాధితుడు బంధువుల ద్వారా తెలియవచ్చింది. అంతేకాకుండా రెస్టారెంట్‌లోని ఫర్నీచర్ కూడా ఈఘటనలో ధ్వంసం అయ్యాయి. జరిగిన సంఘటనపై బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసినట్లు సమాచారం. కాగా గాయపడిన రాజును స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి చికిత్స అందించిన అనంతరం ఇంటికి తరలించినట్లు తెలియవచ్చింది. ఇదివుండగా పోలీస్ స్టేషన్ పక్కనే సంఘటన జరగడం, ఈవార్త దావనంలా వ్యాపించడంతో స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. సమీపంలోనే పోలీస్ స్టేషన్ ఉన్నా బ్లేడుతో దాడి చేయడం చూస్తుంటే ప్రస్తుత ప్రభుత్వ హయంలో శాంతిభద్రతల చర్యలు ఎలా ఉన్నాయో అర్థమవుతుందంటూ పలువురు చర్చించుకోవడం వినిపించింది.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

పిఠాపురం, జనవరి 31: రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా రగ్బీ జట్టు ఎంపిక బుధవారం కాకినాడ జిల్లా పిఠాపురంలో జరిగింది. రగ్బీ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 85మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల్లో చూపి న ప్రతిభ ఆధారంగా విశాఖలో ఈనెల 2 నుంచి 4వ తేది వరకూ జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు 12మంది వంతున 24మంది బాలబాలికలను ఎంపిక చేశారు. వీరు ఉమ్మడిజిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారు. ఎంపిక ప్రక్రియలో రగ్బీ అసోసియేషన్ ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, టెక్నికల్ కమి టీ చైర్మన్ నాగలింగేశ్వరరావు, కె.పద్మనాభం, వంశీ, నవీన్, సతీష్, వై.తాతబ్బాయి, పీడీలు శేషకుమారి, సతీష్, ఎలిఫే సునీల్‌దేశాయి, సతీష్ భార్గవ్ పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు

2, 3 తేదీల్లో పరీక్షలకు

ఇంటర్ విద్యార్థులు హాజరుకావాలి

రాజమహేంద్రవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు-2024లో భాగంగా ఫిబ్రవరి 2న జరిగే నైతికత- మానవీయ విలువలు, 3న నిర్వహించే పర్యావరణ విద్య పరీక్షలకు మొదటి ఏడాది జనరల్, ఒకేషనల్ విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలని ఇంటర్మీడి యట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షకులు ఎన్ఎస్‌వీఎల్ నరశింహం తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకూ ఈ పరీక్షలు జరుగుతాయని. వీటిలో ఉత్తీర్ణత సాధించకపోతే ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకా రం ఇంటర్ పాస్ సర్టిఫికెట్ జారీ చేయరన్నారు. అలాగే ఫిబ్రవరి 5 నుంచి 20 వరకూ ఒకేషనల్, 11 నుంచి 20 వరకూ జనరల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీ క్షలు నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు తమ బ్యాచ్ తెలుసుకొని పరీ క్షలకు హాజరుకావాలని ఆయన సూచించారు.

కాకినాడ

ఎమ్మెల్యే చినరాజప్ప సంతాపం

సామర్లకోట, జనవరి 31: విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, తన గురువు అయిన సామర్లకోటకు చెందిన మట్టపల్లి వెంకటరావు బుధవారం వృద్ధాప్యంతో మృతి చెందడం పట్ల పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తీవ్ర సంతాపం తెలిపారు. వెంకటరావు గృహానికి చేరుకుని పార్థివదేహంపై పూలమాల ఉంచి ఘనంగా నివాళులర్పించారు. శ్రీరామ చంద్రమూర్తి, వజ్జులు, శ్రీనివాస్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


ఐ బ్యాంక్‌ను ప్రారంభించి శిక్షణా కేంద్ర శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న గవర్నర్

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం : గవర్నర్

జేఎన్టీయూకే, జనవరి 31: రెడ్‌క్రాస్ కాకినాడ జిల్లాశాఖ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ తెలిపారు. జేఎన్టీయూకే అతిథిగృహం వద్ద రూ.45లక్షలతో ఏర్పాటు చేసిన లకంసాని విరీస్ మానస్ రెడ్‌క్రాస్ ఐ బ్యాంక్‌ను ప్రారంభించి రూ.1.30 కోట్లతో నిర్మిస్తున్న రెడ్‌క్రాస్ శిశు, మహిళాసంక్షేమ శిక్షణా కేంద్ర నిర్మాణానికి శిలాఫలకాలను బుధవారం ఆయన ఆవిష్కరించారు. గవర్నర్‌కు రెడ్‌క్రాస్ కార్యక్రమాలపై కలెక్టర్ కృతికాశుక్లా వివరించారు. త్వరలో ప్రతాప్‌నగర్‌లో మహిళా శిక్షణా కేంద్రం నిర్మాణం ప్రారంభిస్తామని ఆమె తెలిపారు. ఐ బ్యాంక్, శిక్షణాకేంద్ర నిర్మాణానికి విరాళాలు అందించిన శ్రీసాయిరామ ఫ్రోజెన్ ఫుడ్స్ అధినేత లకంసాని సత్యనారాయణ, జెమినీ ఎడిబుల్ ఆయిల్స్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావును గవర్నర్ అభినందించారు. రాష్ట్ర శాఖ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నాగనరసింహారావు, జిల్లాశాఖ చైర్మన్ వైడీ రామారావు, వైస్‌చైర్మన్ సుగుణ పాల్గొన్నారు.

యువతను ఓటర్లుగా నమోదు చేయాలి : కలెక్టర్

కాకినాడ సిటీ, జనవరి 31: జిల్లాలో 18-19 మధ్య వయసుగల యువతను ఓటర్లుగా నమోదు చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్, ఎన్నికల అధికారి కృతికాశుక్లా కోరారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 ఓటర్ జాబితాలోని అంశాలు, ఈ-ఎపిక్ కార్డుల పంపిణీ, ఈవీఎం, వీవీ ప్యాట్‌ల ద్వారా ఓటింగ్ విధానం వంటి అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు. ఇన్‌చార్జి డీఆర్వో కె.శ్రీరమణి, రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి రవి కిరణ్, గదుల సాయిబాబు, సబ్బారపు అప్పారావు, కాళ్లూరి కృష్ణమోహన్, ఆకుల వెంకటరమణ, తుమ్మల రమేష్, కలెక్టరేట్ ఎన్నికలవిభాగం డీటీ ఎం.జగన్నాథం పాల్గొన్నారు.

నివాస ప్రాంతాలకు దూరంగా వైద్యశిబిరం!

పిఠాపురం, జనవరి 31: జగనన్న సురక్ష కార్యక్రమంలో మంగాయమ్మరావుపేట అర్బన్‌హెల్త్ సెంటర్‌లో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఉదయం 9గంటలకు శిబిరం ప్రారంభించినా 10.30గంటలకు కేవలం నలుగురు మాత్రమే వచ్చారు. వారి నివాసప్రాంతాల నుంచి అర్బన్‌హెల్త్ సెంటర్ 3 కిలోమీటర్ల దూరంలో ఉంది. అంత దూరం వచ్చి వైద్యం చేయించుకునేందుకు ప్రజలు నిరాసక్తి ప్రదర్శించారు. శిబిరం ప్రారంభానికి వచ్చిన ఎంపీ వంగా గీతా విశ్వనాథ్, ఎమ్మెల్యే పెండెం దొరబాబు విషయం తెలుసుకుని సచివాలయ పరిధిలో వైద్యశిబిరం పెట్టకుండా ఇక్కడ పెట్టడం ఏంటని ఎంపీ వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ సచివాలయానికి ఆ వార్డు సచివాలయంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ నాగేశ్వర నాయక్‌కు సూచించారు. హెల్త్‌సెంటర్‌లో నిర్వహించిన శిబిరానికి ప్రజలు అంతగా రాకపోవడంతో సాయంత్రం రథాలపేట సచివాలయం వద్ద శిబిరం ఏర్పాటు చేశారు.

'ఆదిత్య'లో మెగా రక్తదాన శిబిరం

గండేపల్లి, జనవరి 31: సూరంపాలెం ఆదిత్య విద్యాప్రాంగణం నందు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహింగా విద్యాసంస్థల డైరెక్టర్ ఎన్.సుగుణారెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. రాబోయే రోజుల్లో ఆదిత్య ఒక రక్తనిధి ఏర్పాటు చేయడానికి కృషి చేస్తుందన్నారు. కాకినాడ, రాజమండ్రి, రంపచోడవరం ప్రభుత్వాసుపత్రులతో పాటు కాకినాడలోని సిద్దార్థ వలంటీర్ బ్లడ్ బ్యాంకు, రోటరీ, ఇండియన్ రెడ్‌క్రాస్, యువసేన బ్లడ్ బ్యాంక్, రాజమండ్రిలోని విజయశ్రీ, రాజమండ్రి వైఎస్సార్ జక్కంపూడి రామ్మోహన్‌రావు బ్లడ్ బ్యాంక్, పెద్దాపురం రోటరీ బ్లడ్ బ్యాంక్ వారు రక్తాన్ని సేకరించారు. ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డోలా సంజయ్, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, రవిశంకర్, సతీష్‌కుమార్, సంజయ్, రమశ్రీ తదితరులున్నారు.

టీడీపీ కమిటీ ఇన్‌చార్జిలకు శిక్షణా తరగతులు

జగ్గంపేట, జనవరి 31: రావులమ్మనగర్‌లో టీడీపీ కార్యాలయంలో టీడీపీ మండలాధ్యక్షుడు మారిశెట్టి భద్రం ఆధ్వర్యంలో జగ్గంపేట మండలం క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ ఇన్‌చార్జిలు, గ్రామ కమిటీ అధ్యక్షులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అబ్జర్వర్ బొజ్జ సాంబశివ వీర వెంకటసత్యనారాయణ, జి.శివ, సాంబశివరావు, బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కుటుంబ సాధికారిక సభ్యుడు, ఓటర్ జాబితాపై క్లస్టర్, బూత్ ఇన్‌చార్జ్‌లకు అవగాహన కల్పించారు. జీను మణిబాబు, కొత్త కొండబాబు, పైడిపాల సూరిబాబు, బస్వా చిన్నబాబు, దాపర్తి సీతారామయ్య, పాల్గొన్నారు.

తునిలో 'మీ ఇంటికి - మీ దివ్య'

తుని రూరల్, జనవరి 31: తుని 10వ వార్డులో మీ ఇంటికి - మీ దివ్య కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడుతో కలిసి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని మెజారిటీతో గెలిపించాలని కోరారు. తుని పట్టణాధ్యక్షుడు ఇనుగంటి సత్యనారాయణ, పోల్నాటి శేషగిరిరావు, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, జనసేన నాయకులు చోడిశెట్టి గణేష్, షేక్ వల్లి, కుక్కడపు బాలాజీ, జల్లు వాసు పాల్గొన్నారు.

ఓటరు లిస్టులపై అవగాహన

తాళ్లరేవు, జనవరి 31: తాళ్లరేవు టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ బూత్ ఇన్‌చార్జిలు, కుటుంబ సాధికార సభ్యులకు ఓటరు లిస్టులపై అవగాహన కల్పించారు. తాళ్లరేవులో 7 పోలింగ్ బూత్ నెంబర్లు 223, 224, 225, 226, 227, 228, 229లో నూతన ఓటరులిస్టుల్లో తప్పు ఒప్పులు, డబుల్ ఎంట్రీలు, మరణించిన 139మంది ఓటర్లను గుర్తించారు. ఎన్నికల్లో బూత్ ఇన్‌చార్జిలు, కెఎస్ఎస్ సభ్యులు టీడీపీ,జనసేన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. టీడీపీ నేతలు నడింపల్లి వినోద్, వాడ్రేవు వీరబాబు, గంజా సూరిబాబు, వాసంశెట్టి శ్రీనివాస్, రేళ్ల శ్రీనివాస చక్రవర్తి, కుడిపూడి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో 'ఇంటింటా కాంగ్రెస్'

ప్రత్తిపాడు, జనవరి 31: నియోజకవర్గంలో ఇంటింటా కాంగ్రెస్ కార్యక్రమాన్ని బుధవారం ఏలేశ్వరం నగర పంచాయతీ నుంచి ప్రారంభించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని పీసీసీ ఇన్‌చార్జి ఉమ్మిడి వెంకట్రావు ప్రముఖులు తాళ్ళూరు గొల్లాజి, వర్తక సంఘ నాయకులు మూరా వెంకటేశ్వరరావు, విద్యాసంస్థల అధినేత సత్యనారాయణలను కలిసి కాంగ్రెస్ చేపట్టే కార్యక్రమాలు వివరించారు. జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ మొయ్యేటి సూర్యప్రకాశరావు, కోనాబత్తుల పెదబాబు తదితరులున్నారు.

'అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు'

గొల్లప్రోలు రూరల్, జనవరి 31: అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీ హెచ్చరించారు. గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్‌లు, ఉపాధ్యాయులు, పెద్దలతో బుధవారం సమావేశం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో నిర్మాణంలో ఉన్న సచివాలయం, ఆర్బీకే భవనాల్లో పేకాట జరుగుతుందని, మద్యం తాగి పరిసరాలు పాడుచేస్తున్నట్లు తమకు సమాచారం వచ్చిందని, అటువంటివి జరగకుండా చూడాలని సూచించారు. వన్నెపూడిలో శాంతికమిటీ సమావేశంలో పాల్గొన్నారు.

'హైందవ ధర్మాన్ని తెలియజేయాలి'

శంఖవరం, జనవరి 31: హైందవధర్మాన్ని భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని సమరసత ఫౌండేషన్ ఆంధ్రప్రాంత ప్రముఖ కొండా రెడ్డి అన్నారు. బుధవారం నెల్లిపూడి సాదువుగారి ఆశ్రమంలో ఫౌండేషన్ జిల్లా సమావేశం నిర్వహించారు. సంస్థ బలోపేతానికి జిల్లాలో సభ్యత్వాలు పెరిగే విధంగా కృషి చేయాలని మండల సయోజుకులను కోరారు. కార్యక్రమంలో నందూరి కృష్ణ, కంబాల నారాయణరావు, అదట్రా వరహాలు, కొప్పన కోటేశ్వరరావు, పడాల రాంబాబు ఉన్నారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్ర్కీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్, 105 మినిట్స్, కెప్టెన్ మిల్లర్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్ర్కీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్, కెప్టెన్ మిల్లర్

తిరుమల	:	సైంధవ్
లక్ష్మి	:	ఫైటర్
సీ అండ్‌సీ1	:	గుంటూరు కారం
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	నా సామిరంగ
పద్మప్రియ	:	గుంటూరు కారం
సత్యగౌరి	:	నా సామిరంగ
సూర్య 1	:	గుంటూరు కారం
సూర్య 2	:	హనుమాన్

ఆడుదాం ఆంధ్రా పోటీలు

కాకినాడ అర్బన్, జనవరి 31: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో వార్డు సచివాలయ, నియోజకవర్గస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు జిల్లాస్థాయి పోటీలు బుధవారం కాకినాడ డీఎస్ఏ మైదానంలో ప్రారంభమయ్యాయి. బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో కాకినాడకు చెందిన పి.ప్రవీణ్‌కుమార్, బి.గురుసాయిచరణ్ మొదటిస్థానంలో.. రెండోస్థానంలో తునికి చెందిన సీహెచ్ అనిల్‌వర్మ, వి.అభిషేక్, మూడోస్థానంలో రామ్మోహన్, నవాబ్ నిలవగా జేసీ ప్రవీణ్ ఆదిత్య బహుమతులుఇచ్చారు.

తప్పుడు బిల్లులతో నిధులు డ్రా

» దుర్వినియోగమయ్యాయని వైసీపీ కౌన్సిలర్ల ఆగ్రహం

» వాడివేడిగా నగర పంచాయతీ సమావేశం


గొల్లప్రోలు నగర పంచాయతీలో నిధులు దుర్వినియోగం అంశంపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

గొల్లప్రోలు, జనవరి 31: తప్పులు బిల్లులు పెట్టి నగర పంచాయతీకి వచ్చిన నిధులు డ్రా చేశారు. కేటాయించిన పనులకు సక్రమంగా వినియోగించకుండా దుర్వినియోగం చేశారు. వివరాలు అడుగుతుంటే ఇవ్వడం లేదు. సమావేశంలో ప్రశ్నిస్తామని తెలిసి కీలక అధికారులు అందరూ గైర్హాజరు అయ్యారని వైసీపీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాధారణ, అభివృద్ధి పనులు తప్ప మిగిలిన వాటికి కౌన్సిల్ ఆమోదం అవసరం లేదని, కలెక్టరు ఇచ్చిన నిధులతో మీకు సంబంధం లేదంటూ ఒక అధికారిణి ఇచ్చిన సమాధానంతో వారు మండిపడ్డారు. గొల్లప్రోలు నగరపంచాయతీ కార్యాలయంలో బుధవారం చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైసీపీ కౌన్సిలర్లు నిధులు దుర్వినియోగం అంశంపై గళమెత్తారు. సామర్లకోటలో జరిగిన సీఎం సభకు గొల్లప్రోలు నుంచి 5,246మందిని 56 ఆటోల్లో తరలించామని, వారికి టిఫిన్లు ఇతరత్రా ఖర్చుల నిమిత్తం రూ.2లక్షలకు పైగా వ్యయం చేసినట్లు కమిషనర్లు రికార్డుల్లో చూపించిన అంశాన్ని వైస్‌చైర్మన్ తెడ్లపు అలేఖ్యరాణి, కౌన్సిలర్ గంటా అప్పలస్వామి సహా పలువురు వైసీపీ కౌన్సిలర్లు ప్రస్తావించారు. అసలు ఒక్క ఆటో సీఎం పర్యటన నిమిత్తం ఏర్పాటు చేయలేదని, ఆ నిధులన్నింటిని పక్కదారి పట్టించారని తెలిపారు. దీనికి సంబంధించిన ఖర్చుల వివరాలు తెలియజేయాలని డిమాండ్ చేశారు. దీనిపై మున్సిపల్ మేనేజరు రామప్రసాద్ వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించగా సభ్యులు ఒప్పుకోలేదు. నిధులు దుర్వినియోగం అంశం ప్రస్తావనకు వస్తుందనే కమిషనరు, ఇన్‌చార్జి ఏఈ, ఎన్విరాన్‌మెంటల్ ఏఈ, టౌన్ ప్లానింగ్ సహా ఇతర కీలక అధికారులు సెలవు పేరుతో సమావేశానికి గైర్హాజరు అయ్యారని కౌన్సిలర్లు మండిపడ్డారు. జగనన్న సురక్ష వైద్యశిబిరాల నిర్వహణకు రూ.2లక్షలు వ్యయం చేసినట్లు చూపుతున్నారని, అందులో సగం కూడా ఖర్చు పెట్టలేదన్నారు.

రిపేరులో ఉంటే బిల్లులా?

నగరపంచాయతీకి చెందిన మినీ జేసీబీ కొంతకాలంగా రిపేరులో ఉందని, దానికి ఆయిల్ వినియోగించినట్లు ఇంజనీరింగ్ అధికారులు బిల్లులు పెట్టారని వైస్‌చైర్మన్ సహా వైసీపీ కౌన్సిలర్లు ఆరోపించారు. ఇటువంటి తప్పుడు బిల్లులు ఎన్నో పెట్టి నగరపంచాయతీ నిధులను దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. జేఏవో పద్మజ్యోతి మాట్లాడుతూ కలెక్టరు ఇచ్చిన నిధులను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఖర్చు పెట్టవచ్చన్నారు. దీంతో ఒక్కసారిగా కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు బిల్లులతో నిధులు దుర్వినియోగానికి పాల్పడి, ఇప్పుడు వాటి గురించి ప్రశ్నిస్తే కౌన్సిల్ ఆమోదం అవసరం లేదని చెబుతారా అని గంటా అప్పలస్వామి తదితరులు నిలదీశారు. విషయాన్ని సీడీఎంఏ, జిల్లా కలెక్టరు వద్ద తేల్చుకుంటామని తెలిపారు. ప్రతి సచివాలయ పరిధిలో రూ.లక్ష వంతున నిధులతో పాత్‌హోల్స్ మూసివేత పనులు చేపట్టారని వాటి వివరాలు అడుగుతుంటే ఇవ్వడం లేదని వైస్‌చైర్మన్ తెడ్లపు అలేఖ్యరాణి తెలిపారు. పట్టణంలో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరాను పాత కాంట్రాక్టర్‌కే అప్పగించడంపై టీడీపీ కౌన్సిలరు గుళ్ల సుబ్బారావు, పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. కౌన్సిలర్లు మైనం భవానీ, మొగలి దొరబాబు, దమ్మాల లక్ష్మీ పాల్గొన్నారు.

బీసీలకు రాజ్యాధికారం కల్పించిన టీడీపీ


జయహో బీసీ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న కొండబాబు, సత్తిబాబు, శ్రీనివాసబాబా

సర్పవరం జంక్షన్, జనవరి 31: దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం లభిస్తే, ఎన్టీఆర్ టీడీపీ ఏర్పాటు చేసి బీసీలకు 24 శాతం రాజకీయంతో రాజ్యాధికారం కల్పించి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కిందని మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కాకినాడ రూరల్ పరిశీలకులు కుడుపూడి సత్తిబాబు అన్నారు. మంగళవారం రమణయ్యపేట ఒకటో డివిజన్ కాపుల వినాయక కల్యాణ మండపంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా ఆధ్వర్యంలో 1,2,3,42,47,48,49, 50 డివిజన్ల పరిధిలో గల బీసీ నాయకులు, కార్యకర్తలతో జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలను గుర్తించి ఆర్థికంగా బలోపేతం చేసి రాజకీయ ప్రోత్సాహాన్ని చంద్రబాబు అందించారన్నారు. వైసీపీ దుర్మార్గపాలనకు చరమగీతం పాడేందుకు సమష్టిగా కృషి చేయాలని, టీడీపీ-జనసేన పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. బీసీ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, శ్రీనివాస యాదవ్, గదుల సాయిబాబా, కాకరపల్లి సత్యవతిచలపతిరావు, కొండా వినాయక్ మాట్లాడారు. నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, రాందేవు సీతయ్య దొర, దేవు వెంకన్న, వేటుకూరి నాగమణి ఉన్నారు.

జయహో బీసీ సదస్సులో నాయకులు

'బీసీలపై అక్రమ కేసులు'

ప్రత్తిపాడు, జనవరి 31: బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం బీసీలపై అక్రమ కేసులు పెట్టి అణచివేస్తుందని టీడీపీ రాష్ట్ర బీసీ నాయకులు విమర్శించారు. ఏలేశ్వరం ఎస్.కన్వెన్షన్‌హాల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ రాజా ఆధ్వర్యంలో జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర టీడీపీ కార్యదర్శి కాకినాడ రాంబాబు, రాష్ట్ర పెరికి సాధికార సంఘ అధ్యక్షుడు వనపర్తి బద్రి మాట్లాడుతూ బీసీలకు తీరని అన్యాయం చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో తగిన రీతిలో బుద్ధి చెప్పాలన్నారు. సత్యప్రభ మాట్లాడుతూ బీసీలంతా ఐక్యమత్యంగా రాబోయే ఎన్నికల్లో టీడీపీని గద్దెనెక్కించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా, నియోజకవర్గ బీసీ నాయకులు ఒమ్మి బాలాజీ, కొమిరిశెట్టి నరసింగరావు, మూది నారాయణ స్వామి, ధనుకుల వీరభద్రం, రీసు సత్తిబాబు, ఒనుం మంగ, శ్రీకాంత్, మింగి సత్యనారాయణ, బి.కన్నారావు, బి.బాసు, చల్లారాజు, ఈపు రాజబాబు, నక్కా కృష్ణ, వైబోగుల సుబ్బారావు, శ్రీను పాల్గొన్నారు.


ప్రత్తిపాడు:ఏలేశ్వరంలో మాట్లాడుతున్న సత్యప్రభ

'చొల్లంగివాసులకే ఇళ్ల పట్టాలివ్వాలి'

తాళ్లరేవు, జనవరి 31: చొల్లంగి సర్వేనెం.47లో సాల్ట్ డిపార్ట్‌మెంటుకు చెందిన ఖాళీ స్థలాలను చొల్లంగివాసులకే ఇవ్వాలని, కరప మండలం ఉప్పలంక గ్రామస్తులకు ఇవ్వద్దని చొల్లంగి లబ్ధిదారులు బుధవారం ఆందోళన చేపట్టారు. కరప మండల రెవెన్యూ, పోలీసులు చొల్లంగి ఖాళీస్థలంలో మొక్కలు పాతితుండగా చొల్లంగివాసులు అడ్డుకున్నారు. కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, జనసేన కోఆర్డినేటర్ పితాని బాలకృష్ణ ఆందోళనకారులతో చర్చించి వివరాలు తెలసుకున్నారు. వారు మాట్లాడుతూ చొల్లంగి లబ్ధిదారులకు జి.వేమవరం, పటవల గ్రామాల్లో ఇచ్చిన జగనన్న ఇళ్ల స్థలాలు రద్దు చేసి ఈ ఖాళీ స్థలాల్లో చొల్లంగి లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టరును గురువారం కలవనున్నట్లు తెలిపారు. టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, ధూళిపూడి వెంకటరమణ, కట్టా త్రిమూర్తులు, చొల్లంగి గ్రామస్తులున్నారు.

టీడీపీ ఇంటిగ్రేటెడ్ శిక్షణా తరగతులు

గండేపల్లి, జనవరి 31: గండేపల్లి గ్రామ శివారులో ఉన్న పరిణయ ఫంక్షన్ హాల్లో బుధవారం టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహన్‌రావు ఆధ్వర్యంలో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లు, గ్రామ కమిటీ అధ్యక్షులతో ఇంటిగ్రేటెడ్ శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోర్పు లచ్చయ్యదొర, క్లస్టర్ ఇన్‌చార్జిలు అడబాల భాస్కరరావు, బొల్లంరెడ్డి రామకృష్ణ, పాలకుర్తి ఆదినారాయణ, యర్రంశెట్టి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: జగపతినగరం న్యూమెన్ స్కూల్ ఆవరణలో టీడీపీ మండలాధ్యక్షుడు చందరం చంటిబాబు, పాలెం కస్టర్ ఇన్‌చార్జ్ పాఠంశెట్టి మురళీకృష్ణ ఆధ్వర్యంలో మండలంలో క్లస్టర్, యూనిట్, బూత్‌కమిటీ ఇన్‌చార్జ్‌లు, గ్రామ కమిటీ అధ్యక్షులకు ఇంటిగ్రేటెడ్ శిక్షణా తరగతులు నిర్వహించారు. కాకినాడ క్లస్టర్ ఇన్‌చార్జ్ గాది శివ, భూపాలపట్నం సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు, క్లస్టర్ ఇన్‌చార్జి కుర్ల చినబాబు, టీడీపీ నాయకులు తూము కుమార్, గుడాల రాంబాబు, మహిళా అధ్యక్షురాలు సరకణం కుమారి, సత్యనారాయణ, ఆళ్ళ నానాజీ, శ్రీమన్నారాయణ, కాళ్ళ వెంకటేష్, కె.తాతాజీ ఉన్నారు.

చెత్త వాహనాలను అడ్డుకున్న రైతులు

పిఠాపురం, జనవరి 31: డంపింగ్‌యార్డులో వేయాల్సిన చెత్తను రోడ్డు పక్కనే వేస్తుండడంతో దుర్గంధభూరిత వాతావరణం వల్ల ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ చెత్త వాహనాలను అడ్డుకున్నారు. పిఠాపురంలోని చెత్తాచెదారాన్ని ట్రాక్టర్లు, ఇతర వాహనాలపై మాధవపురం రోడ్డులోని డంపింగ్‌యార్డుకు రోజూ తరలిస్తూ ఉంటారు. అయితే యార్డులో కాకుండా చెత్తను రోడ్డుపై వేస్తుండడంతో ఆ మార్గమంతా దుర్గంధపూరితంగా మారింది. రైతులు మున్సిపల్ చెత్త వాహనాలను అడ్డుకుని ఆందోళనకు దిగారు. కమిషనరు కనకారావు, శానిటరీ ఇనస్పెక్టర్ బంగారు తిరుమల రైతులతో చర్చించారు. రోడ్డుపై వేసిన చెత్తను తొలగిస్తామని, ఇలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్త తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఏలేరు కాలువలో పడి వ్యక్తి గల్లంతు

గొల్లప్రోలు, జనవరి 31: ఏలేరు కాలువలో గొల్లప్రోలు బల్లకట్టు వద్ద ఒక వ్యక్తి పడి గల్లంతయ్యాడు. ఏలేరు నీటిని పీబీసీకి మళ్లించేందుకు గానూ కొందరు కూలీలు బల్లకట్టు వద్ద గట్లు ఎత్తు చేసే పనులు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో ఒక వ్యక్తి నీటిలోకి దూకాడు. వెంటనే అక్కడ పనిచేస్తున్న కూలీలు అతడిని రక్షించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. పోలీసులు,అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం రాత్రి వరకూ వ్యక్తి ఆచూకీ లభ్యం కాలేదు. గల్లంతైన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.

'రాజారెడ్డి రాజ్యాంగం అమలు'

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 31: ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి మహాత్ముల విగ్రహాలను తొలగించి కాకినాడలో రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని జనసేన సిటీ ఇన్‌చార్జ్ ముత్తా శశిధర్ ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 60రోజుల తర్వాత సీఎం జగన్, ద్వారంపూడికి ఫుల్‌స్టాప్ పెడతామన్నారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాసిరెడ్డి శివ, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్య, జిల్లా కార్యదర్శి అట్ల సత్యనారాయణ, బడే కృష్ణ పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీలో భారీగా చేరికలు


తునిరూరల్:టీడీపీలోకి చేరినవారితో యనమల


జగ్గంపేట: టీడీపీలో చేరినవారితో నెహ్రూ

తుని రూరల్, జనవరి 31: మండలంలోని ఎస్.అన్నవరం గ్రామంలో రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాలు పెద్ద ఎత్తున టీడీపీలోకి చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి టీడీపీ సీనియర్ నేత, పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో పోలిశెట్టి వీరబాబు, రామలింగేశ్వరరావు, ధారబాబు, సత్తిబాబు, మార్కండేయులు, అనీల్, శేఖర్‌లతో పాటుగా కాపు సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు ఉన్నాయి. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు, మండలాధ్యక్షుడు అప్పన రమేష్, జనసేన నేత చోడిశెట్టి గణేష్, మోతుకూరి వెంకటేష్, వంగలపూడి బుజ్జి, పోల్నాటి శేషగిరిరావు, ఇనుగంటి సత్యనారాయణ, చింతమనీడి నాగ సోమరాజు, గాది వలహాల బాబు పాల్గొన్నారు.

మామిడాడలో...

జగ్గంపేట: జగ్గంపేట మండల మామిడాడలో గ్రామపెద్దల ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన దళితులు, దళిత మహిళలు 150 మంది వైసీపీకి రాజీనామా చేసి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, ఎంపీటీసీ వేగి రామకృష్ణ, బస్వా చిన్నబాబు, కుంచే తాతాజీ, దాపర్తి సీతారామయ్య, బద్ది సురేష్, పెంటకోట సత్యనారాయణ, బొడ్డేటి సుమన్, దేశెట్టి శ్రీను, దేవర కృష్ణ, దెయ్యాల పార్వతి, సుందరపు నాగు పాల్గొన్నారు.

పిఠాపురంలో...

పిఠాపురం: పట్టణంలోని పాదగయ క్షేత్రం వద్ద గల ఆటోస్టాండు వద్ద 22వ వార్డుకు చెందిన కాదా రాజు మిత్రబృందం, యానాదుల కాలనీ, జగ్గయ్యచెరువు కాలనీకి చెందిన పలువురు ఆటోడ్రైవర్లు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ కండువాలు కప్పి ఆహ్వానించారు.

'స్థలాలను కబ్జా చేసేందుకు వైసీపీ ప్రయత్నం'

పిఠాపురం, జనవరి 31: పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలో మండలపరిషత్ కార్యాలయం సమీపంలో గల ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసేందుకు అధికార వైసీపీ కౌన్సిలర్లు ప్రయత్నిస్తున్నారని.. ఇందుకు ఎంపీ, ఎమ్మెల్యేల ప్రోద్బలం ఉందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆరోపించారు. జిల్లా కలెక్టరు తక్షణం జోక్యం చేసుకుని ప్రభుత్వస్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ జగ్గయ్యచెరువు కాలనీలో సుమారు 600 పట్టాలు అన్యాక్రాంతమయ్యాయని, చనిపోయిన తహశీల్దార్ సంతకాలతో స్టాంపులు వేసి వైసీపీ నాయకులు అమ్ముకుంటున్నారని తెలిపారు. జగ్గయ్యచెరువు కాలనీలో రూ.100కోట్ల మేర స్కాం జరిగిందని ఆరోపించారు. కాలనీలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ స్థలాలును గుర్తించడంతో పాటు కబ్జాలకు పాల్పడుతున్న వారిపై కేసులు పెట్టాలని వర్మ డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు రెడ్డెం భాస్కరరావు, కొండేపూడి సూర్యప్రకాష్, పిల్లి చిన్నా, కౌన్సిలర్లు అల్లవరపు నగేష్, అయితే రాంబాబు, నల్లా శ్రీను, కోళ్ల బంగారుబాబు, నూతాటి ప్రకాష్ తదితరులు ఉన్నారు.

ఆలయంలో చోరీ

కిర్లంపూడి, జనవరి 31: మండలంలోని సోమవరం గ్రామంలో వెంకన్నబాబు, శివాలయం, కనక దుర్గమ్మ, కృష్ణుడు, సాయిబాబా ఆలయాల్లో దొంగలు చొరబడి తలుపుల బద్దల కొట్టి హుండీలు తెరవడానికి ప్రయత్నించారు. కనకదుర్గమ్మ ఆలయంలోని హుండీ గునపంతో తెరవడానికి ప్రయత్నించి రాకపోవడంతో వదిలివేశారు. కృష్ణుడు ఆలయంలో 2స్టీల్ హుండీల్లో డబ్బులు తీసుకుని ఆ హుండీలను బయటపడేశారు. మరికొన్ని ఆలయాల్లో ఆలయం తలుపులు తెరిచి ఉన్నాయి. బుధవారం తెల్లవారు జామున వచ్చిన పూజారులు ఈ సంఘటనలు చూసి ఆలయ కమిటీ సభ్యులకు తెలియజేశారు. జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, కిర్లంపూడి ఎస్ఐ జబీర్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆలయాలను పరిశీలించారు. అనంతరం కాకినాడ నుంచి క్లూస్ టీం వచ్చివేలి ముద్రల సేకరణ చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కిర్లంపూడి ఎస్ఐ జబీర్ తెలిపారు.

వికాస ద్వారా ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పన

కరప, జనవరి 31: మండల పరిధిలోని నిరుద్యోగ యువకులకు వికాస ద్వారా ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పనకు ఈ నెల 3,5,6 తేదీల్లో వివిధ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఎంపీడీవో బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరపలోని చిరంజీవి కల్యాణ మండపంలో ఈ నెల 3న ఉదయం 10 గంటల నుంచి కరప, వలసపాకల, కొరిపల్లి, జెడ్.భావారం, గొడ్డటిపాలెం, అరట్లకట్ట, పాతర్లగడ్డ, పెనుగుదురు, నడకుదురు, గురజనాపల్లి, ఉప్పలంక గ్రామాల వారికి.. పెద్దాపురప్పాడులోని బిరుదా సూర్యనారాయణ(ఫకీర్రావు)జడ్పీ ఉన్నత పాఠశాలలో 5న ఉదయం 10 నుంచి పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం, కొంగోడు, యండమూరు, గొర్రిపూడి గ్రామానికి.. వేళంగిలోని మెర్లాస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 ఉదయం 10 నుంచి వేళంగి, వేములపాడు, వాకాడ, పెదకొత్తూరు, కూరాడ, సిరిపురం, జి.భావారం గ్రామాల వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఎస్ఎస్‌సీ, ఐటీఐ, డిప్లమో, గ్రాడ్యుయేషన్ పాసైన వారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అన్నవరం దేవస్థానానికి కిర్లంపూడి సత్రం దత్తత

అన్నవరం, జనవరి 31: అన్నవరంలో ద్వారకా తిరుమల దేవస్థానానికి చెందిన కిర్లంపూడి సత్రం అన్నవరం దేవస్థానానికి దత్తత ఇస్తూ దేవదాయ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఇకపై ఈసత్రం అన్నవరం దేవస్థానం సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయ పరిధిలోకి రానుంది.

ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా సతీష్‌కుమార్

సర్పవరం జంక్షన్, జనవరి 31: కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్‌ని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 29న ప్రభుత్వం పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు తొలుత ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా కర్నూలు సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పాటిల్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2రోజులకే మళ్లీ కృష్ణకాంత్ పాటిల్‌ని విజయవాడ లా అండ్ ఆర్డర్ డీసీపీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు అదపు బాధ్యతలు అప్పగిస్తూ నియమించారు.

'కుష్ఠువ్యాధిపై అవగాహన ఉండాలి'

తుని రూరల్, జనవరి 31: కుష్ఠువ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జాయింట్ డైరెక్టర్ (లెప్రసీ) డాక్టర్ దేవసాగర్ స్పష్టం చేశారు. స్పర్శ కుష్ఠువ్యాధి అవగాహన కార్యక్రమంలో తేటగుంట పీహెచ్‌సీలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఆర్‌రమేష్‌తో కలిసి ఏఎన్ఎంలకు ఆయన అవగాహన కల్పించారు. వ్యాధి కారణాలు, నిర్ధారణ నివారణ అంశాలపై చర్చించి ప్రజలను చైతన్యపరిచే దిశగా తేటగుంటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అవగాహనతో కుష్ఠువ్యాధిని తరమికొట్టవచ్చన్నారు. పీహెచ్‌సీ వైద్యురాలు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టా.స్వాతి, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

డాక్టర్ సమీరాడి తనిఖీలు

కొత్తపల్లి, జనవరి 31: కొత్తపల్లి మండలంలో పలు గ్రామాల్లో పాత్ (ప్రోగ్రామ్ ఫర్ ఎప్రోపియేట్ టెక్నాలజీ ఇన్ హెల్త్) అధికారిణి డాక్టర్ సమీరాడి బుధవారం తనిఖీలు నిర్వహించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహణ, వంటల రుచులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లకు ఇచ్చే పౌష్టికాహార నాణ్యతను పరిశీలించారు. చౌకధరల దుకాణాల ద్వారా ప్రజలకు సరఫరా జరిగే నిత్యావసర వస్తువులను పరిశీలించారు.

రామాచార్యులకు సత్కారం



రమణక్కపేట (కొత్తపల్లి), జనవరి 31: 40 ఏళ్ల పాటు విద్యాశాఖలో వివిధ హోదాల్లో పనిచేసి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా పదవీ విరమణ చేసిన ఏవీకే.రామాచార్యుల సేవలను కాకినాడ జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఆర్‌జేడీ రాజు ప్రశంసించారు. రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సన్మాన సభలో స్వచ్ఛంద పదవీవిరమణ చేసిన రామాచార్యులకు ఆయన దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఎంఈవోలు బుర్రా వేణుగోపాల్, పైడిరాజు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, పాఠశాల విద్యాకమిటీ సభ్యులు రామాచార్యులను పూలమాలతో సత్కరించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

కోటనందూరు, జనవరి 31: పాతకొట్టాంలో హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న యర్ర వెంకటరమణ దంపతులను బుధవారం ఘనంగా సన్మానించారు. టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీపీ ఇట్టంశెట్టి భాస్కర్‌రావు, లోవ దేవస్థానం మాజీ చైర్మెన్ బొంగు ఉమారావు, ఉపాధ్యాయులు మాతిరెడ్డి ఎర్రా పాత్రుడు, దాడిచెల్లారావు, దాడి కొండబాబు. పైల దాలినాయుడు, సింగపల్లి సన్యాసిదేవుడు, యర్ర చినసత్యనారాయణ, చిటికెల సనత్యరారాయణ, బొండు గోపాలకృష్ణ, సీఆర్పీ యర్రశేఖర్,సంపెంగి మన్నేష్,లోవరాజు ఉన్నారు.

ఎంపీడీవో శ్రీలలితకు వీడ్కోలు

సామర్లకోట, జనవరి 31: సామర్లకోట ఎంపీడీవోగా పని చేస్తూ తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు బదిలీ అయిన డి.శ్రీలలితకు సామర్లకోట ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో బుధవారం సన్మానించి వీడ్కోలు పలికారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, అధికారులు, కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ సచివాలయాల అధికారులు శ్రీలలితను పూలమాలు వేసి శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేశారు.

ఎంపీడీవో కుమార్‌బాబుకు సన్మానం

ప్రత్తిపాడు, జనవరి 31: ప్రత్తిపాడు ఎంపీడీవోగా పని చేసి బదిలీపై వెళ్తున్న ఎంవీఆర్ కుమార్‌బాబును మండల ప్రజా ప్రతినిధులు,అధికారులు సన్మానించారు. ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, స్థానిక పెద్దలు బెహరా దొరబాబు, పినిశెట్టి ప్రకాష్, ఏనుగుపల్లి శేఖర్, ఏవో శ్రీనివాసరావు, మండల పరిషత్ సిబ్బంది మూర్తి, సురేష్, కార్యదర్శులు ద్విభాష్యం శ్రీనివాసరావు, కామరాజు, వీరబాబు, సత్యనారాయణ ఉన్నారు.

ఫిజియోథెరపీ శిబిరం

కోటనందూరు, జనవరి 31: సర్వశిక్షాభియాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీని సద్వినియోగ పర్చుకోవాలని ఫిజియోథెరపిస్టు డాక్టర్ టీఎస్ఎస్ సోమేశ్వరరావు అన్నారు. బుధవారం కోటనందూరులో ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు.ఐఈఆర్పీలు నాగగోవిందు, నారాయణరావు ఉన్నారు.

వరుపుల సత్యప్రభ పరామర్శ

రౌతులపూడి, జనవరి 31: లచ్చిరెడ్డిపాలెంలో ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ పర్యటించి అనారోగ్యానికి గురైన, ఇటీవల మృతిచెందిన 10 కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, గుర్రం రాంబాబు, దొరబాబు, గాది కృష్ణ, కోటిపల్లి రాజు, గింజాల అప్పలరాజు, కుంకుపూడి ఆనందరావు, జి.వరహాలు ఉన్నారు.

చట్టాలపై అవగాహన

శంఖవరం, జనవరి 31: స్ట్రీట్ బాలల దినోత్సవం సందర్భంగా ప్యానెల్ అడ్వకేట్ కూచిమంచి సూర్యప్రకాష్ కత్తిపూడిలో పలుచోట్ల చిన్నారులకు చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. పంచాయితీ సిబ్బంది స్వామి, నాగమణి, దేశలింక రమణ,యామిని,పెరుమళ్ళ కోవెల సాయి ఉన్నారు.